క్లుప్తంగా

నేడు ఉద్యోగ మేళా

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని రాజీవ్ గాంధీ ఐటీఐలో తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్ పవర్ కంపెనీ లిమిటెడ్ ఆధ్వర్యంలో శనివారం ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జ్ ఎంప్లాయ్‌మెంట్ అధికారి డి.శంకర్ శుక్రవారం తెలిపారు. ఎంపికైనవారి అర్హతను బట్టి, శిక్షణ ఇచ్చి ఉద్యోగం ఇప్పించడానికి ఈ సంస్థ పనిచేస్తుందన్నారు. వివరాలకు 94415 35253 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

కడెం-జగిత్యాల బస్సు పునఃప్రారంభం

కడెం: కడెం-జగిత్యాల వయా రాయికల్, బోర్నపల్లి, బెల్లాల్ మీదుగా వెళ్లే బస్సును శుక్రవారం పునః ప్రారంభించినట్లు జగిత్యాల డిపో మేనేజర్ సునీత ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆర్టీసీ బస్సు రోజు మూడు ట్రిప్పులు నడుస్తుందని.. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. శుక్రవారం మండలంలోని బెల్లాల్, పెర్కపల్లి గ్రామస్తులు బస్సుకు పూజలు చేసి స్వాగతం పలికారు.

కొనసాగుతున్న సర్వే


వివరాలు తెలుసుకుంటున్న అధికారులు

ఖానాపూర్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన డిజిటల్ ఆరోగ్య కార్డుల జారీ సర్వే మండలంలోని కొత్తపేట గ్రామంలో రెండోరోజు కొనసాగింది. పైలట్ ప్రాజెక్టులో భాగంగా ఎంపికైన కొత్తపేటలో ఐదురోజులు రెండు బృందాలతో ఈ ప్రత్యేక సర్వే నిర్వహిస్తామని జెడ్పీ సీఈవో గోవింద్ తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో సునీత, ఎంపీవో రత్నాకర్ రావు తదితరులు ఉన్నారు.

ఎన్‌ఎస్‌యూఐ కమిటీలు రద్దు

భైంసాటౌన్: జిల్లాలోని ఎన్‌ఎస్‌యూఐ కమిటీలు రద్దు చేస్తున్నట్టు జిల్లా కార్య నిర్వాహక మాజీ అధ్యక్షుడు అంజాద్ షేక్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర బాధ్యులు మహమ్మద్ ఫరాన్, ప్రతీక్ సింగ్ ఆదేశాల మేరకు మండల, తాలూకా కమిటీలు రద్దు చేసినట్లు పేర్కొన్నారు. త్వరలోనే అన్ని మండలాలు, తాలూకాలకు నూతన కమిటీలను ఏర్పాటు చేస్తామని వెల్లడించారు.

వ్యాధులపై అవగాహన

ఖానాపూర్: పట్టణంలోని పోలీస్‌స్టేషన్‌తో పాటు పలు ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రభుత్వ ఆస్పత్రి ఐసీటీసీ విభాగం ఆధ్వర్యంలో దీర్ఘకాలిక వ్యాధులపై అవగాహన కల్పించారు. అధికారులు, కార్యాలయానికి వచ్చిన ప్రజలకు అంశాలు వివరించారు. ప్రభుత్వ ఆస్పత్రిలో హెచ్ఐవీ, టీబీ వంటి సేవలను వినియోగించుకోవాలని పేర్కొన్నారు. ఎస్టీఎస్ వేణుగోపాల్, అధికారులు ఉన్నారు.

పొదుపు అలవర్చుకోవాలి


అవగాహన కల్పిస్తున్న కళాకారులు

కుంటాల: ప్రతి ఒక్కరూ పొదుపు అలవాటు చేసుకొని ఆర్థికంగా ఎదగాలని కుంటాల టీజీబీ మేనేజర్ సుధీర్ సూచించారు. శుక్రవారం మండలంలోని అంబకంటితండాలో ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా కళాకారులు పొదుపుపై ప్రదర్శనలు చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సతీశ్, సిబ్బంది విక్రమ్, మాజీ సర్పంచ్ యాదవ్ శంకర్, గోకుల్, సీఏసీ ముక్తేశ్వర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

'బీజేపీతోనే దేశాభివృద్ధి'


మాట్లాడుతున్న ఎంపీ నగేశ్

కడెం: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంతోనే దేశాభివృద్ధి సాధ్యమని ఆదిలాబాద్ ఎంపీ నగేశ్ అన్నారు. శుక్రవారం మండలంలోని నవాబ్‌పేట్ గ్రామంలో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించగా ఎంపీ పాల్గొని మాట్లాడారు. కార్యకర్తలు, నాయకులు సభ్యత్వ నమోదు ప్రక్రియలో వేగం పెంచి క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. బీజేపీ రాష్ట్ర నాయకుడు రితేశ్ రాథోడ్, మండలాధ్యక్షుడు కాశవేణి శ్రీనివాస్, జక్కుల సత్తన్న, రవీందర్ గౌడ్, మోహన్ నాయక్, కృష్ణ, నగేశ్ పాల్గొన్నారు.

డీజే వినియోగంపై నిషేధం

ముధోల్: జిల్లా వ్యాప్తంగా డీజే వినియోగంపై నిషేధం విధిస్తూ ఎస్పీ, కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేసినట్లు ఎస్సై సాయికిరణ్ తెలిపారు. డీజేల నుంచి వచ్చే అధిక శబ్దాలతో గుండెపోటు, ఇతర వ్యాధులు, చిన్నారుల్లో శాశ్వత వినికిడి లోపం ఏర్పడే ప్రమాదం ఉన్నందున ఊరేగింపుల్లో డీజే సౌండ్ మిక్సర్లు, యాంప్లిఫయర్, బాణాసంచా వినియోగం నిషేధించినట్లు పేర్కొన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పండుగకు పస్తులేనా!

- పెండింగ్ వేతనాల కోసం పారిశుద్ధ్య కార్మికుల సమ్మె
- నిర్మల్‌లో ఎక్కడికక్కడ పేరుకుపోతున్న చెత్తకుప్పలు
- పట్టించుకోని మున్సిపాలిటీ అధికారులు


కూరగాయల మార్కెట్‌లో పేరుకుపోయిన చెత్తాచెదారం

నిర్మల్‌టౌన్: తమకు పెండింగ్‌లో ఉన్న మూడు నెలల వేతనాలు చెల్లించాలని పట్టణంలోని మున్సిపల్ పారిశుద్ధ్య కాంట్రాక్టు కార్మికులు నిరసన తెలుపుతున్న విషయం తెలిసిందే. నాలుగు రోజులుగా విధులు బహిష్కరించి ఆందోళన చేస్తున్నారు. దీంతో పట్టణంలో ఎక్కడికక్కడ చెత్త కుప్పలుగా పేరుకుపోయాయి. దోమలు వ్యాప్తి చెంది రోగాల బారిన పడుతున్నామని ప్రజలు ఆందోళన వ్యక్తం చెందుతున్నారు.

నిర్మల్ మున్సిపాలిటీలో..

మున్సిపాలిటీ పరిధిలో రెగ్యులర్ కార్మికులు 15 మంది.. కాంట్రాక్ట్ కార్మికులు 287 మంది విధులు నిర్వర్తిస్తున్నారు. శానిటరీ, విద్యుద్దీకరణ, వాటర్ సప్లయ్ విభాగంతోపాటు కార్యాలయంలో వీరు పని చేస్తున్నారు. మున్సిపల్ అధికారులు రెగ్యులర్ సిబ్బందితో వీధులు శుభ్రం చేయించినా.. ఎక్కడి చెత్త అక్కడే పేరుకుపోతుంది.

నాలుగు రోజులుగా నిరసన ..

వేతనాలు రాకుంటే పూట గడవడం కష్టంగా ఉందని.. పిల్లల ఖర్చులు, స్కూల్ ఫీజులు చెల్లించక ఇబ్బంది పడుతున్నామని కాంట్రాక్టు కార్మికులు వాపోయారు. అప్పులు చేసి జీవనం సాగిస్తున్నామని.. దసరా పండుగ వేళ పిల్లలకు కొత్త బట్టలు కొనిచ్చే పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పట్టణప్రజల ఆరోగ్యం కోసం సూర్యుడు రాకముందే మేం విధుల్లోకి వచ్చి రోడ్లు, డ్రెయినేజీలను శుభ్రం చేస్తున్నామని.. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు మాకు సకాలంలో వేతనాలు చెల్లించాలని వేడుకుంటున్నారు.

స్పందించని అధికారులు..

కార్మికుల నిరసనకు పలువురు రాజకీయ, కార్మిక సంఘాల నాయకులు మద్దతు తెలిపారు. వేతనాలు ఇవ్వకుంటే కార్మికులతో కలిసి నిరాహార దీక్ష చేపడతామన్నారు. నాలుగు రోజులుగా నిరసన చేపడుతున్నా.. మున్సిపల్ చైర్మన్, కమిషనర్ పట్టించుకోవడం లేదని కార్మికులు వాపోతున్నారు.

కుటుంబపోషణకు ఇబ్బంది



మూడు నెలలుగా వేతనాలు రాకపోవడంతో కుటుంబపోషణకు ఇబ్బంది పడుతున్నాం. ప్రభుత్వం పీఎఫ్ సౌకర్యం కల్పిస్తామని చెప్పి స్పందించడం లేదు. పిల్లల స్కూల్ ఫీజులు కట్టలేదు. పండుగ వేళ అప్పు పుట్టడం లేదు. మా వేతనాలు విడుదల చేసి ఉద్యోగ భద్రత కల్పించాలి.

– కృష్ణ, పారిశుధ్య కార్మికుడు

నిధులున్నా ఇవ్వడం లేదు..



మున్సిపాలిటీలో ఒక్కో కాంట్రాక్టు కార్మికుడికి నెలకు రూ.10 వేల నుంచి రూ.18 వేల వరకు అందిస్తారు. అది కూడా సకాలంలో ఇవ్వడం లేదు. మేమెట్లా బతికేది. మున్సిపల్‌లో స్టేట్, సెంట్రల్ ఫండ్స్ ఉన్నా.. వేతనాలు ఇవ్వకుండా మాతో పని చేయించుకుంటున్నారు. ఎన్నిసార్లు అడిగినా దాటవేస్తున్నరు.

–విజయ్, పారిశుధ్య కార్మికుడు

పన్నులు వసూలు చేసి చెల్లిస్తాం



కాంట్రాక్టు కార్మికులకు ఆగస్టు, సెప్టెంబర్ మాసాలకు సంబంధించిన జీతాలే పెండింగ్‌లో ఉన్నాయి. దసరా తర్వాత పన్నులు వసూలు చేసి కార్మికులందరికీ వేతనాలు పూర్తిగా చెల్లిస్తాం.

– సీవీఎస్.రాజు, మున్సిపల్ కమిషనర్

నేరాల నియంత్రణకే కార్డన్‌సెర్చ్

- ఖానాపూర్ సీఐ సైదారావు
- పత్రాలు లేని వాహనాలు స్వాధీనం


కాలనీవాసులతో మాట్లాడుతున్న సీఐ సైదారావు

ఖానాపూర్: అసాంఘిక కార్యకలాపాలు, నేరాల నియంత్రణకే కార్డన్‌సెర్చ్ నిర్వహిస్తున్నట్లు ఖానాపూర్ సీఐ సైదారావు అన్నారు. శుక్రవారం పట్టణంలోని అంబేద్కర్‌నగర్ కాలనీలో తెల్లవారుజామున కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా పత్రాలు సరిగా లేని 50 బైక్‌లు, రెండు త్రీ వీలర్స్, రెండు ఫోర్ వీలర్స్‌లను సీజ్ చేసినట్లు తెలిపారు. వాహనదారులు అన్ని ధ్రువపత్రాలు కలిగి ఉండాలని పేర్కొన్నారు. మద్యం, గుట్కా, గంజాయి విక్రయం గురించి తెలిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని అన్నారు. అనంతరం సీసీ కెమెరాలతో లాభాలు, సైబర్‌నేరాల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో సర్కిల్ పరిధిలోని ఎస్సైలు, సిబ్బంది ఉన్నారు.

బాలుడి మృతి కారకుడికి జైలు

కడెం: రోడ్డు ప్రమాదంలో బాలుడి మృతికి కారణమైన వ్యక్తికి ఏడురోజుల జైలు, రూ.వెయ్యి జరిమానా విధిస్తూ ఖానాపూర్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ జితిన్‌కుమార్ శుక్రవారం తీర్పునిచ్చారు. ఎస్సై కృష్ణసాగర్‌రెడ్డి, కోర్టు డ్యూటీ ఆఫీసర్ నర్సింహ కథనం ప్రకారం.. కడెం మండలంలోని నచ్చన్‌ఎల్లాపూర్ గ్రామం వద్ద 2019లో జరిగిన రోడ్డు ప్రమాదంలో జన్నారం మండలం జువ్విగూడకు చెందిన బాలుడు పవార్ భరత్ మృతిచెందాడు. ప్రమాదానికి కారణమైన నిందితుడు లక్ష్మీసాగర్ వాసి గుగ్లావత్ శ్రీనివాస్‌పై మృతుడి తల్లి అనూషబాయి ఫిర్యాదు చేయగా అప్పటి ఎస్సై మహేశ్ కేసు నమోదు చేశారు. కోర్టులో ఏపీపీ దేవేందర్ సాక్షులను హాజరుపర్చగా నేరం రుజువుకావడంతో మెజిస్ట్రేట్ తీర్పునిచ్చారు.

శ్రీగాయత్రీదేవి రూపంలో అమ్మవారు


కుంటాల: ఓలాలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు


సోన్: కూచన్‌పెల్లిలో దుర్గాదేవి మండపం వద్ద పూజల్లో పాల్గొన్న మహిళలు


నర్సాపూర్(జి)లో పూజలు చేస్తున్న భక్తులు


లక్ష్మణచాంద: మునిపెల్లిలో..


లోకేశ్వరం : ధర్మోరలో..

సోన్: దేవి శరన్నవరాత్రుల్లో భాగంగా అమ్మవారు రెండోరోజు శ్రీ గాయత్రీదేవి రూపంలో భక్తులకు దర్శనమిచ్చింది. శుక్రవారం మండలంలోని కూచన్‌పెల్లిలో శ్రీదుర్గా మాత ఉత్సవ సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రతిమకు ప్రత్యేక పూజలు చేశారు. కమిటీ సభ్యులు సీహెచ్. రామకృష్ణ, శ్రీనివాస్, విజయ్, గణేశ్, దీక్షాపరులు పాల్గొన్నారు.

కుంటాల: మండలంలోని ఓలా గ్రామంలో వీడీసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుర్గాదేవి మండపం వద్ద మహిళలు, గ్రామస్తులు ప్రత్యేక పూజలు చేశారు. భగవాన్ జోష్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, చింత హంస-సాయన్న దంపతుల ఆధ్వర్యంలో అన్నదానం చేశారు.

లక్ష్మణచాంద: మండలంలోని పలు గ్రామాల్లో దుర్గాదేవి మండపాల వద్ద అన్నదానం చేశారు.

ఖానాపూర్: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా దుర్గాదేవి మండపాల వద్ద భక్తులు శుక్రవారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. పట్టణంలోని జేకేనగర్ దుర్గామాత మండపంలో గురువారం రాత్రి మున్సిపల్ చైర్మన్ చిన్నం సత్యం పూజలు చేశారు.

నర్సాపూర్(జి): మండల కేంద్రంలోని కుర్మెవాడలో దుర్గాదేవి శుక్రవారం గాయత్రీదేవి రూపంలో భక్తులకు దర్శనమిచ్చింది. పురోహితులు యుగంధర్ శర్మ ఆధ్వర్యంలో పూజలు చేసి భక్తులకు తీర్థప్రసాదం అందజేశారు.

లోకేశ్వరం: మండలంలోని ధర్మోర, కన్కపూర్ గ్రామాల్లో శుక్రవారం దుర్గాదేవి ప్రతిమలకు భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు దుర్గామాతకు హారతులిచ్చి పూజలు చేశారు. పంతులు జగదీశ్, స్వాములు పాల్గొన్నారు.

వన్యప్రాణి సంరక్షణలో భాగస్వాములవ్వాలి


అవగాహన కల్పిస్తున్న అధికారులు

ఖానాపూర్: అడవుల సమతుల్యతలో భాగంగా వన్యప్రాణి సంరక్షణలో అందరూ భాగస్వాములు కావాలని ఎఫ్ఆర్‌వో కిరణ్ అన్నారు. శుక్రవారం మండలంలోని సత్తనపల్లి అటవీప్రాంతంలో ఆయా గ్రామాల ప్రజలకు వన్యప్రాణుల సంరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అటవీ అధికారులు, సిబ్బంది, గ్రామస్తులు ఉన్నారు.

వృద్ధుడిని కాపాడిన గంగపుత్రులు

బాసర: మండల కేంద్రంలో గోదావరిలో దూకేందుకు యత్నించిన వృద్ధుడిని గంగపుత్రులు ప్రాణాలతో కాపాడారు. పుష్కర ఘాటు వద్ద అనుమానాస్పదంగా తిరుగుతూ దూకేందుకు యత్నించిన వృద్ధుడిని గంగపుత్రులు కాపాడి పోలీసులకు అప్పగించారు.

లోకేశ్వరంలో ఫ్రెషర్స్ డే



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

లోకేశ్వరం: చదువుతోనే గౌరవం, గుర్తింపు లభిస్తుందని.. విద్యార్థులు పట్టుదల, ప్రణాళికతో చదువుకోవాలని ప్రిన్సిపాల్ గౌతమ్ అన్నారు. శుక్రవారం లోకేశ్వరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు ఫ్రెషర్స్ డే నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థుల నృత్యాలు అలరించాయి. అనంతరం బతుకమ్మ వేడుకలు ఏర్పాటు చేయగా విద్యార్థులు ఆడిపాడారు. కార్యక్రమంలో అధ్యాపకులు చిన్నయ్య, వినోద్, వెంకటేశ్వర్లు, హరీశ్, విఠల్, శ్రీనివాస్, మహేందర్ పాల్గొన్నారు.

అక్రమకేసులు ఎత్తివేయాలని వినతి

భైంసాటౌన్: ఒక వర్గాన్ని సంతృప్తి పరిచేందుకు పోలీసులు హిందువులపై అక్రమ కేసులు పెడుతున్నారని హిందూ ధర్మ పరిరక్షణ సమితి, భైంసా నాయకులు ఆరోపించారు. అక్రమ కేసులు ఎత్తివేయాలంటూ శుక్రవారం పట్టణంలోని ఏఎస్పీ కార్యాలయంలో అవినాశ్‌కుమార్‌ను కలిసి డిమాండ్ చేస్తూ వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇటీవల కుభీర్ మండలంలో జరిగిన ఘటనలో ఓ వర్గం యువకుడు మైనర్ బాలికకు మాయమాటలు చెప్పి భైంసాకు తీసుకొచ్చి అత్యాచారానికి యత్నిస్తే, అడ్డుకున్న వారిపై హత్యాయత్నం కేసులు పెట్టడం, అర్ధరాత్రి ఇళ్లలోకి చొరబడి అరెస్టు చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. సదరు యువకుడి వద్ద పిస్తోలు, చాకు వంటి మారణాయుధాలున్నాయని వాపోయారు. నిషేధిత పీఎఫ్ఐ సంస్థలో శిక్షణ తీసుకున్న కొందరు గతంలో భైంసాలో పట్టుబడిన నేపథ్యంలో, పోలీసులు ఈ దిశగా దర్యాప్తు చేయాలని కోరారు. పట్టణంలో శాంతియుత వాతావరణానికి భంగం కలిగించే వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో హిందూధర్మ పరిరక్షణ సమితి నాయకులు, మహిళలు ఉన్నారు.

మంచి నీటి సహాయకులకు శిక్షణ


శిక్షణ శిబిరంలో పాల్గొన్న అధికారులు

మామడ: మండల కేంద్రంలో మామడ, లక్ష్మణచాంద మండలాల్లోని గ్రామాలకు చెందిన మిషన్ భగీరథ నీటి సహాయకులకు, స్వయం సహాయక సంఘాల సభ్యులకు శుక్రవారం అవగాహన సమావేశం నిర్వహించారు. భగీరథ నీటి వినియోగం, పైపులైన్లకు మరమ్మతులు చేసే విధానంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో చీఫ్ ఇంజినీర్ జ్ఞానకుమార్, ఈఈ సందీప్, డీఈ హరీశ్‌కుమార్, ఎంపీడీఓ గంగాసాగర్‌రెడ్డి, ఏపీఎం అరుణ, ఈజీఎస్ ఏపీవో శివాజీ, ఏఈ క్రాంతికుమార్, అభినవ్, సెర్ప్ సిబ్బంది, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలి


ఎల్విలో పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి శ్రీనివాస్


నర్సాపూర్(జి)లో అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

తానూరు: గ్రామాలను పరిశుభ్రంగా ఉంచేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని మండల ప్రత్యేకాధికారి శ్రీనివాస్ సూచించారు. శుక్రవారం మండలంలోని ఎల్వి గ్రామంలో పర్యటించారు. వీధుల్లో తిరుగుతూ పారిశుధ్య పనులను పరిశీలించారు. అనంతరం సమస్యలు అడిగి తెలుసుకున్నారు. మురికి కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రపరిచి గ్రామస్తులకు క్లోరినేషన్ నీటిని అందించాలని పేర్కొన్నారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రంతనిఖీ చేసి లబ్ధిదారులకు పౌష్టికాహారం అందించాలని నిర్వాహకులకు సూచించారు. అనంతరం గ్రామపంచాయతీ కార్యాలయంలో రికార్డులను పరిశీలించారు. వారి వెంట ఎంపీడీవో అబ్దుల్ సమద్, పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్, గణేశ్, సిబ్బంది తదితరులు ఉన్నారు.

నర్సాపూర్(జి): మండల కేంద్రంతోపాటు చాక్‌పల్లి, నందన్, టెంబుర్ని, తిమ్మాపూర్(జి) గ్రామాల్లో శుక్రవారం డ్రైడేపై గ్రామస్తులకు పంచాయతీ కార్యదర్శులు అవగాహన కల్పించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా నిల్వనీటిని పారబోయాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు రాథోడ్ కైలాస్, నరేశ్‌కుమార్, వెంకటేశ్, శైలజ, సాయికిరణ్, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

కళాశాలల్లో బతుకమ్మ వేడుకలు


వశిష్టలో వేడుకల్లో విద్యార్థినులు, అధ్యాపకులు


బతుకమ్మ ఆడుతున్న విద్యార్థినులు

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని వశిష్ట డిగ్రీ కళాశాలలో శుక్రవారం బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థినులు తీరొక్క పూలతో బతుకమ్మలను పేర్చి ఆడిపాడారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ అఖిలేశ్‌కుమార్, వైస్ ప్రిన్సిపాల్ శశిధర్, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

నిర్మల్‌ఖిల్లా: నిర్మల్‌లోని ఎస్సెస్సార్ జూనియర్ కళాశాల మైదానంలో శుక్రవారం ఏబీవీపీ నిర్మల్ శాఖ ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలు నిర్వహించారు. ఏబీవీపీ విభాగ్ కన్వీనర్ చంద్రగిరి శివకుమార్, ప్రిన్సిపాల్ గోవర్ధన్, సురేశ్, రాజు దినేశ్, మున్నా, మహేశ్, విద్యార్థినులు పాల్గొన్నారు.

ఆహ్లాదమా.. నీ జాడేది?


భాగ్యనగర్ పార్కులో పిచ్చిమొక్కలు

జిల్లా కేంద్రంలోని భాగ్యనగర్ కాలనీలో మున్సిపల్‌శాఖ ఆధ్వర్యంలో సుమారు రూ.10లక్షలు వెచ్చించి ఏర్పాటు చేసిన అర్బన్ పార్కు అధ్వానంగా మారింది. చిన్నారులు, పెద్దలకు ఆహ్లాదం పంచేందుకు పార్కు చుట్టూ నిర్మించిన వాకింగ్ ట్రాక్ నిర్వహణను గాలికొదిలేశారు. సేదతీరేందుకు, ఆడుకునేందుకు ఆటస్థలం కరువైందని.. అధికారులు స్పందించి పార్కును శుభ్రం చేయాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్


పనికి రాకుండా చిన్నారుల ఆటపరికరాలు


ఏపుగా పెరిగిన పిచ్చిమొక్కలు

వేణుగోపాలస్వామి ఉత్సవాలు

లక్ష్మణచాంద: మండల కేంద్రంలో శ్రీ అష్ట భుజ వేణుగోపాలస్వామి ఉత్సవాలు కొనసాగుతున్నాయి. దసరా నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని శుక్రవారం స్వామివారిని చంద్రప్రభ వాహనంపై ఊరేగించారు. రథోత్సవంలో భక్తులు పాల్గొన్నారు.